## ఎవరి లాభం కోసం మూసీ రాగం?

- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని ఇండ్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- సీఎం బెదిరింపులకు బీఆర్‌ఎస్ భయపడదు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : 'ఎవరి లాభం కోసం మూసీ ప్రక్షాళన? రాష్ట్రంలో ఏ సమస్యలు లేన్నట్టు ఈ మూసీ రాగం ఎందుకు? ఢిల్లీకి డబ్బుల మూటలు మోసేందుకేనా? 51 కిలోమీటర్లు ఉన్న రివర్ అభివృద్ధికి రూ.1.50 లక్షల కోట్లు ఎందుకు?' అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం మూసీపై సీఎం రేవంత్ మాట్లాడిన మాటలు పూర్తిగా సత్యదూరమని ఒక ప్రకటనలో ఖండించారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే మూసీ రివర్ బెడ్‌లోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ఇండ్లు, వారికిచ్చే పరిహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ పేరిట సీఎం రేవంత్ పేదల కష్టార్జితాన్ని నేలపాలు చేస్తున్నాడని విమర్శించారు. పునరావాసం పేరిట మూసీ బాధితులకు కేసీఆర్ కట్టిన డబుల్ బెడ్రూం ఇండ్లను ఇస్తున్న నువ్వు.. కొత్తగా వారికి ఇచ్చింది ఏంటి? అని నిలదీశారు. మొదట రూ.1.50 లక్షల కోట్లతో మూసీని సుందరీకరిస్తామని చెప్పిన రేవంత్, ఇప్పుడు మాట మారుస్తున్నారని విమర్శించారు. 371 కిలోమీటర్లు ఉన్న సబర్మతి రివర్ ఫ్రంట్‌కు రూ.1,400 కోట్లు, 2500 కిలో మీటర్లు ఉన్న నమామి గంగేకు రూ.25 వేల కోట్లు వెచ్చిస్తే, 51 కిలో మీటర్లు ఉన్న మూసీ ప్రక్షాళనకు రూ.1.50 లక్షల కోట్లు ఎందుకు? అని నిలదీశారు. 'మూసీ పరీవాహక ప్రాంతంలో ఒక్క మట్టిపెళ్ల కూడా తీయలేదంటున్న నీకు.. ఇండ్లు కూలిన పేదల శాపనార్థాలు వినపడతలేవా' అని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టకుంటే రేవంత్‌కు పూటగడవదని ఎద్దేవా చేశారు. పదవి పోతుందనే అభద్రతా భావంతోనే ఆయన ఇలా వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నారు. కేటీఆర్ పేదల పక్షాన మాట్లాడుతూ భరోసా ఇస్తుంటే, తట్టుకోలేని సీఎం ప్రెస్‌మీట్ పెట్టి నీతివాక్యాలు వల్లిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ బెదిరింపులకు బీఆర్‌ఎస్ భయపడబోదని తేల్చిచెప్పారు. మూసీ బాధితులకు అండగా ఉండి రేవంత్ దోపిడీని అడ్డుకుంటామని స్పష్టంచేశారు.

## ● ఆశాలకు 18 వేల వేతనం చెల్లించాలి



హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): తమకు రూ.18 వేల వేతనం ఇచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును ఆశ వర్కర్లు కోరారు. ఈ మేరకు సంఘం అధ్యక్షురాలు రావుల సంతోష, ప్రధాన కార్యదర్శి బీ కరుణ తదితరులు గురువారం తెలంగాణభవన్‌లో కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా కనీసం వేతనం రూ.18 వేలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఖాళీగా ఉన్న ఆశ వర్కర్ల పోస్టులను భర్తీ చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు. ఆశ వర్కర్లకు హెల్త్‌కార్డులు అందించాలని, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం పోస్టులను అర్హత ఉన్న ఆశ వర్కర్లతో భర్తీ చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు.

## ● పేదల ఇండ్లు కూల్చితే ఊరుకోం



హైదరాబాద్, అక్టోబరు 17 (నమస్తే తెలంగాణ): మూసీ పరీవాహక ప్రాంత ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ధైర్యం చెప్పారు. మూసీ బాధితులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని అభయమిచ్చారు. గురువారం మూసీ పరీవాహక ప్రాంతానికి చెందిన పలువురు తెలంగాణభవన్‌లో కేటీఆర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మూసీ ప్రాజెక్ట్ పేరుతో కాంగ్రెస్ సర్కార్ తమ ఇండ్లను కూల్చే ప్రయత్నం చేస్తున్నదని, తమకు అండగా ఉండాలంటూ వేడుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే పర్మిషన్లు ఇచ్చి ఇప్పుడు పేదలను కబ్జాదారులనడం దారుణమని మండిపడ్డారు. బాధితులకు ఏ సమస్య వచ్చినా బీఆర్‌ఎస్ నాయకులను సంప్రదించాలని సూచించారు.

## మూసీపై నేడు కేటీఆర్ ప్రజెంటేషన్

- బీఆర్‌ఎస్ సర్కార్ చేపట్టిన కార్యాచరణ వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): మూసీ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ సర్కార్ ప్రత్యేకించి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో అర్థరహితమైన వ్యాఖ్యలు చేశారని బీఆర్‌ఎస్ భగ్గుమంటుంది. మూసీనది ప్రక్షాళన కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ఫలితంగా మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రజలకు కలిగిన ప్రయోజనాలు, మూసీ ప్రాజెక్టు కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేసిన అడుగులు మొదలైన అంశాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం మీడియా కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. మూసీ ప్రక్షాళన కోసం బీఆర్‌ఎస్ చేపట్టిన కార్యాచరణపై కేటీఆర్ వెల్లడించనున్న అంశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

## మీరైనా న్యాయం చేయండి!

- ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించిన మూసీ బాధితులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ పేరుతో నిరుపేద ఎస్సీ కుటుంబాలను కాంగ్రెస్ సర్కార్ విచ్ఛిన్నం చేస్తున్నదని ఆరోపిస్తూ బాధితులు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ నేతృత్వంలో వారు ఎస్సీ కమిషన్‌కు వెళ్లారు. 'చట్టబద్ధంగా ఇండ్లు నిర్మించుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం తాగునీరు, విద్యుత్తు కనెక్షన్ ఇచ్చింది. పన్నులు చెల్లిస్తున్నాం. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ మావి అక్రమ నిర్మాణాలని చెప్తున్నది' అని బాధితులు పిటిషన్‌లో పేర్కొన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూసేకరణ చేయడానికి ముందు సామాజిక ప్రభావాన్ని అంచనా వేయాలి. కానీ సర్కార్ ఎలాంటి సర్వే చేయకుండా, బాధితుల అభిప్రాయాలు పట్టించుకోకుండా తమను తరలించడానికి యత్నిస్తున్నదని తెలిపారు. తమకు ప్రత్యామ్నాయం చూపడం లేదని, పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.

# భావోద్వేగ భవన్.. భరోసా సదన్

- బీఆర్‌ఎస్ ఆఫీస్‌కు క్యూకడుతున్న బాధితులు
- ఒక్కరోజే తరలివచ్చిన నాలుగు వర్గాలు
- ఎప్పటికైనా ఆదుకునే నేస్తం బీఆర్‌ఎస్సే
- అన్నివేళలా అండగా ఉంటామన్న కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): ఉద్యమ సమయంలో తెలంగాణ ఆకాంక్షల సౌధంగా నిలిచిన తెలంగాణభవన్.. నేడు ప్రజల కష్టాలను పంచుకొని, వారి సమస్యల పరిష్కారానికి దారిచూపే నిలయంగా మారుతున్నది. తెలంగాణ సమాజానికి బీఆర్‌ఎస్‌తో ఉన్న భావోద్వేగ బంధానికి గురువారం నాటి పరిణామాలే నిదర్శనం. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ పార్టీకి, కేంద్రంలోని అధికార బీజేపీకి ఎనిమిదేసి సీట్ల ఇచ్చిన ప్రజలే ఇప్పుడు ఆ పార్టీలను ఈసడించుకుంటున్నారని చెప్పడానికి తెలంగాణభవన్‌లో కనిపిస్తున్న దృశ్యాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి వివిధ వర్గాల బాధితులు తమ గోడు వెళ్లబోసుకోవడానికి తెలంగాణభవన్‌కు తరలివస్తున్నారు. రైతులు, ఉద్యోగార్థులు, హైడ్రా బాధితులు, మహిళలు ఇలా అన్ని వర్గాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ భవన్ తలుపులు తడుతున్నారు.

### ఆవేదనాభరితం

తెలంగాణభవన్ గురువారం బీఆర్‌ఎస్వీ ప్రతినిధులతో కోలాహలంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఆహ్వానిత సభ్యులతో ఏ స్థాయిలో కిక్కిరిసిపోయిందో, అదేస్థాయిలో ఆయా బాధిత వర్గాలతో ఆవేదనాభరితమైంది. జీవో-29తో తమ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థులు ఆవేదన చెందారు. 22 రకాల సమస్యలతో హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రీషెడ్యూల్ చేయాలంటూ బుధవారం రాత్రి అశోక్‌నగర్‌లో ఆందోళన నిర్వహించిన వారిని పోలీసులు అరెస్టు చేశారని, వారి విడుదలకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవటంతోపాటు తమకు న్యాయ సాయం అందించాలని కేటీఆర్‌ను కోరేందుకు వందలాదిగా తెలంగాణభవన్‌కు తరలివచ్చారు. తమకు రూ.19 వేల గౌరవ వేతనం ఇస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి 10 నెలలైనా మాట నిలుపుకోలేదని ఆశావర్కర్లు.. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపిస్తామని చెప్పిన కాంగ్రెస్ పెద్దలు మొహం చాటేశారంటూ ఆటోడ్రైవర్లు.. చెప్పాపెట్టకుండా సర్కార్ హైడ్రా పేరుతో తమ కష్టార్జితాన్ని నేలకూలుస్తున్నదని ఇండ్లు కోల్పోయిన బాధితులు.. ఇలా ఒక్కరోజే నాలుగు వర్గాల బాధితులవెతలతో తెలంగాణభవన్ గంభీరంగా మారింది. వచ్చిన ప్రతి వర్గానికీ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఏనాటికైనా స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చెప్పిన మాటలను కేటీఆర్ గుర్తుచేస్తూ ఎన్నికల్లో ఓట్లు సీట్లు ముఖ్యం కాదని, తెలంగాణ ప్రజల కష్టసుఖాల్లో భాగం పంచుకోవడం బీఆర్‌ఎస్ డీఎన్‌ఏలోనే ఉన్నదని స్పష్టం చేశారు. అన్నివర్గాలకు అండగా ఉంటామని అభయమిచ్చారు.

## ● ఆటో డ్రైవర్లకు అండగా బీఆర్‌ఎస్



హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): ఆటో డ్రైవర్లకు ఎల్లవేళలా అండగా ఉంటామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నవంబర్ 5న తలపెట్టిన 'ఆటో డ్రైవర్ల మహాధర్నా' పోస్టర్‌ను కేటీఆర్ గురువారం నందినగర్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కాంగ్రెస్ సర్కార్ పరిష్కారం చూపకపోవడం బాధకరమని బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య పేర్కొన్నారు. ధర్నాకు ఆటో డ్రైవర్లు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

## సర్కారు నై 'పుణ్యం'.. వొకేషనల్ ఖాళీ!

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): 'స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఫోకస్ పెట్టాం. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చాం. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. నిరుద్యోగ నిర్మూలనకు మా చిత్తశుద్ధి ఇదిగో' అంటూ తరుచూ ప్రభుత్వం చెబుతున్నది. ఇంతవరకు బాగానే ఉన్నా పాఠశాల దశలో స్కిల్స్ నేర్పించాలన్న అంశాన్ని మాత్రం పూర్తిగా విస్మరించింది. అత్యంత కీలకమైన స్కిల్స్ నేర్పించే టీచర్ పోస్టులను భర్తీచేయడంలేదు. రాష్ట్రంలో 973 స్కిల్ కోర్సులను నేర్పించే టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 1,231 పోస్టులకు ప్రస్తుతం 258 మంది టీచర్లు మాత్రమే పనిచేస్తున్నారు. ముఖ్యంగా క్రాఫ్ట్ టీచర్ పోస్టులు 509, ఆర్ట్ అండ్ డ్రాయింగ్ టీచర్ పోస్టులు 238, వొకేషనల్ టీచర్ పోస్టులు 126 ఖాళీగా ఉన్నాయి. పరిస్థితి ఇలా ఉంటే పాఠశాల దశలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు పునాదులెలా పడతాయన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### 100 స్కూళ్లల్లోనే..

పాఠశాల స్థాయి వృత్తివిద్యను ఇప్పటికే పలు పాఠశాలల్లో అమలుచేస్తున్నారు. రాష్ట్రంలో 26వేలకుపైగా బడులుంటే కేవలం 100 స్కూళ్లల్లోనే సమగ్రశిక్ష ద్వారా వొకేషనల్ విద్యను అమలుచేస్తున్నారు. వొకేషనల్ టీచర్లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనే నియమిస్తున్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కోర్సులను నిర్వహించడంలో సీబీఎస్‌ఈ సహా మాడల్ స్కూళ్లు ముందంజలో ఉన్నాయి. సీబీఎస్‌ఈ 40కి పైగా వొకేషనల్ కోర్సులను నిర్వహిస్తున్నది. రాష్ట్రంలో మాడల్ స్కూళ్లల్లో 10 కోర్సులను అమలుపరుస్తున్నారు. 9 నుంచి 12వ తరగతుల విద్యార్థులు తప్పనిసరిగా ఏదేనీ రెండు ట్రేడ్లను పూర్తిచేయాలన్న నిబంధన పెట్టారు. ఇంటర్‌స్థాయిలోనూ ప్రభుత్వ కాలేజీల్లో వొకేషనల్ కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా పాఠశాల దశలో స్కిల్ డెవలప్‌మెంట్‌ను పట్టించుకోకపోవడంపై విమర్శలొస్తున్నాయి. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీచేసి, పాఠశాల దశలోనే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# మసిపూసి.. మూసీ!

మొదటిపేజీ తరువాయి...

కౌంటర్ వేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో నవ్వులపాలయ్యారు. మాజీ సీఎం కేసీఆర్‌ను, మూసీ బాధితులకు అండగా నిలుస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావును తిట్టడానికే ప్రెస్‌మీట్ పెట్టినట్టు కనిపించింది.

### సుందరీకరణ.. మీరన్నదే

తాము చేపట్టింది మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కాదని, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు అని ప్రెస్‌మీట్‌లో రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అసలు సుందరీకరణ అని ఎక్కడి నుంచి వచ్చింది? అని, ఆ పదం ఎందుకు వాడుతున్నారని మీడియాను ప్రశ్నించారు. వాస్తవానికి ఆ పదాన్ని ఉపయోగించింది తానేనన్న విషయాన్ని సీఎం మర్చిపోయినట్టున్నారు. ఈ ఏడాది జూలై 20న గోపనపల్లిలో ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'మూసీని సుందరీకరించి లండన్‌లోని థేమ్స్ కంటే అద్భుతంగా అభివృద్ధి చేస్తాం' అని చెప్పారు.

### పీపీపీ మాటేమిటి?

కన్సల్టెంట్లకు రూ.141 కోట్లతో మాత్రమే ఒప్పందం చేసుకున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆ వెంటనే ప్రాజెక్టుకు నిధుల సమీకరణ గురించి మాట్లాడుతూ అవసరమైతే ప్రాజెక్టును పీపీపీ పద్ధతిలో వాళ్లకే అప్పగించే ఆలోచన చేస్తామని కూడా అన్నారు. దీంతో దీనర్థం ఏమిటి? ఒప్పందం విలువ కేవలం రూ.141 కోట్లేనా? అనే ప్రశ్నలు మొదలయ్యాయి.

### మూడు.. ఐదయ్యాయి

సింగపూర్‌కు చెందిన మెయినహార్ట్, రియోస్, కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ అనే మూడు కంపెనీల కన్సార్షియంకు మాస్టర్‌ప్లాన్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఈ నెల 4న ప్రభుత్వం జీవో ఆర్టీ నెంబరు 472 జారీ చేసింది. అందులో ఈ మూడు కంపెనీల పేర్లను స్పష్టంగా పేర్కొన్నది. ఐదో తేదీన ఎంఆర్‌డీసీఎల్ చీఫ్ ఇంజినీర్ ఈ మూడు కంపెనీలతో ఒప్పందం చేసుకుంటూ ఎల్‌వోఏ కూడా జారీచేశారు. రేవంత్‌రెడ్డి మాత్రం గురువారం ప్రెస్‌మీట్‌లో ఈ మూడు కంపెనీలతో పాటు ఝూ, సోమ్ అనే మరో రెండు కంపెనీలను కూడా కలిపి ఐదు కంపెనీల కన్సార్షియంకు బాధ్యతలు అప్పగించామని చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఒకలా? సీఎం వ్యాఖ్యలు మరోలా? అసలు టెండర్లలో బిడ్ దాఖలు చేయని ఝూ, సోమ్ కంపెనీలకు బాధ్యతలు ఎలా అప్పగిస్తారు? అనేది తేలాల్సి ఉంది.



### పునరుజ్జీవనంలో కంపెనీల గోల ఎందుకు?

మూసీ సుందరీకరణ కాదు, పునరుజ్జీవనం అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే పేదల ఇండ్లను కూల్చివేస్తున్నామని చెప్పారు. సాంకేతికంగా నది పునరుజ్జీవనం అంటే శతాబ్దం కిందట మూసీ ఎలా ఉందో అలా తయారుచేయడం. అందులో మురుగు, పరిశ్రమల నుంచి కాలుష్యం చేరకుండా కట్టడి చేయడం. ఇదే జరిగితే దాని పరీవాహకంలో ఉన్న నిరుపేదల బతుకులు బాగుపడినట్టే కదా! ఇప్పటివరకు మురుగు పక్కన ఉన్న ఆ పేదల నివాసాలు స్వచ్ఛమైన మూసీ జలాలు పారే నదీ పరీవాహకంలో ఉండటమంటే అదో అద్భుతమైన దృశ్యం కదా. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం పేదల ఇండ్లను కూల్చి, వారిని అక్కడి నుంచి తరలిస్తామంటున్నారు. అంటే సామాన్యుడికి ఆ అద్భుతమైన నదీ పరీవాహకంలో ఉండే అదృష్టం లేదా? అనే సందేహాలు కలుగుతున్నాయి. పేదల ఇండ్లను కూల్చిన తర్వాత అక్కడ అంతర్జాతీయ కంపెనీలు కొలువుదీరుతాయని కూడా సీఎం చెప్పారు. తాము ఎంపిక చేసిన సింగపూర్ కన్సల్టెన్సీల కన్సార్షియం కార్పొరేట్ కంపెనీలను తీసుకువచ్చి అక్కడ రకరకాల ప్రాజెక్టులు చేపట్టేలా చొరవ తీసుకుంటాయని చెప్పారు. అంటే పేదల ఇండ్లను కూల్చివేసి ఆ స్థలాల్లో కార్పొరేట్ కంపెనీలు కొలువుదీరుతాయని స్పష్టత ఇచ్చారు. అలాంటప్పుడు అది మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ఎలా అవుతుంది? కార్పొరేట్ కంపెనీలు కొలువుదీరి వినోద, విలాస ప్రాజెక్టుల్లో భాగమైన మల్టీప్లెక్స్‌లు, ఆకాశహర్మ్యాలు, ఎక్స్‌ప్రెస్‌వేలు కొలువుదీరితే అది సుందరీకరణ కాక మరేమవుతుందో ప్రభుత్వానికే తెలియాలి.

### సమతామూర్తికి మెయిన్‌హార్ట్‌కు సంబంధం లేదు

మూసీ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్న మెయిన్‌హార్ట్ కంపెనీని వెనుకేసుకొచ్చేందుకు రేవంత్‌రెడ్డి విశ్వ ప్రయత్నం చేశారు. ఆ కంపెనీ దేశ విదేశాల్లో అనేక అద్భుతాలు సృష్టించిందని కొనియాడారు. ఈ క్రమంలో పప్పులో కాలేశారు. హైదరాబాద్ శివారు ముచ్చింతల్‌లో చినజీయర్ స్వామి ట్రస్ట్ నిర్మించిన ఆదిశంకరాచార్య విగ్రహం 'సమతామూర్తి' పనులు మెయిన్‌హార్ట్ ఆధ్వర్యంలో జరిగాయంటూ గొప్పలు చెప్పారు. కేసీఆర్‌పై, చినజీయర్‌స్వామిపై అసందర్భ వ్యాఖ్యలు చేశారు. కానీ, మెయిన్‌హార్ట్ కంపెనీకి, సమతామూర్తికి ఎలాంటి సంబంధం లేదు. కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా సమతామూర్తి ప్రాజెక్టు వివరాలేమీ లేవు. డిజైన్ కన్సల్టెంట్‌గా పద్మ విభూషణ్ డాక్టర్ రాఘవన్ ఎన్ అయ్యర్ బృందం పనిచేసింది. కాంట్రాక్టర్‌గా వేరే కంపెనీ వ్యవహరించింది. ఈ విషయాలను కూడా సీఎం పరిశీలించకపోవడంపై విశ్లేషకులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రెస్‌మీట్‌లో మధ్యప్రదేశ్‌లోని విగ్రహాన్ని చూపించి శంషాబాద్‌లోని విగ్రహంగా ప్రచారం చేశారు.

### ఆరోపణలపై వివరణ ఏది?

మెయిన్‌హార్ట్ కంపెనీపై పాకిస్థాన్ ప్రభుత్వం నోటీసులు జారీచేసిన అంశంపై రేవంత్‌రెడ్డి ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ప్రెస్‌మీట్‌లో కంపెనీ ప్రతినిధులు కూడా పాల్గొన్నారని సీఎం చెప్పారు. కనీసం వారితో అయినా వివరణ ఇప్పించే ప్రయత్నం చేయడం లేదు.

### ఒక్క పెళ్ల కూడా కూల్చలేదు

మూసీ పరీవాహకంలో ఒక్క పెళ్ల కూడా ప్రభుత్వం కూల్చలేదని రేవంత్ చెప్పారు. నిర్వాసితులే స్వచ్ఛందంగా ఇండ్లను వదిలిపెట్టి, ఆనందంగా వెళ్లిపోయారని చెప్పుకొచ్చారు. కానీ, మూసీ పరీవాహక ప్రాంతంలో తమ ఇండ్లు కూల్చొద్దంటూ కన్నీళ్లు పెట్టుకున్న ఘటనలు ఎన్నో ఉన్నాయని, ఇంట్లో ఉన్న సామాను తీసుకునే సమయం కూడా ఇవ్వలేదని, కనీసం తమ పుస్తకాలు కూడా తీసుకోనివ్వలేదని స్థానికులు కన్నీరుమున్నీరైన ఘటనలు ఎన్నో ఉన్నాయి.

### రాడార్ స్టేషన్.. కసబ్

మూసీ నది జన్మస్థానమైన వికారాబాద్‌లో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు చేస్తే నది కలుషితం అవుతుంది కదా? మరి పునరుజ్జీవం ఎలా సాధ్యం అన్న మీడియా ప్రశ్నకు సీఎం ఎదురుదాడి చేశారు. ఇది దేశభక్తికి సంబంధించిన అంశం అంటూ, ఈ ప్రాజెక్టును వ్యతిరేకించేవాళ్లను ఉగ్రవాది కసబ్‌తో పోల్చారు.

### మూసీ పుట్టుకకు కొత్త అర్థం

మూసీ నది చరిత్రపై, పేరుపై సీఎం రేవంత్‌రెడ్డి కొత్త అర్థాలు చెప్పారు. చరిత్రకారులకే తెలియని కొత్త చరిత్ర సృష్టించారు. మూసా, ఈసా కలయికే మూసీ అనే సంగతి అందరికీ తెలిసిందే. అయితే మూసా అంటే మోజెస్ అని, ఈసా అంటే ఏసు అని కొత్త అర్థం చెప్పారు. మోజెస్, ఏసు కలయికతో రామలింగేశ్వర స్వామి దగ్గర ప్రారంభమై మక్కా మసీదును దాటుకుంటూ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నదంటూ కొత్త అర్థం చెప్పారు. దీనిపై చరిత్రకారులు సైతం నోరెళ్లబెడుతున్నారు.

### అఖిల పక్షం.. ప్రశ్నలు పంపండి

మూసీ ప్రాజెక్టుపై అఖిల పక్షాన్ని పిలిచి అనుమానాలు నివృత్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో చెప్పారు. కానీ ఇప్పుడు మాట మార్చి ప్రశ్నలు, అనుమానాలను పేపర్‌పై రాసి పంపాలంటూ సూచన చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నారని, మూసీపై ముందుకు వెళ్లలేక, ప్రజాగ్రహం నుంచి తప్పించుకోవడాకే ఈ ప్రెస్‌మీట్ పెట్టారని చెప్తున్నారు. కానీ, అరకొర సమాచారంతో మీడియా ముందుకు వచ్చి ఒకటి చెప్పబోయి, మరొకటి చెప్పి అభాసుపాలయ్యారు.

## లక్షన్నర కోట్లా.. మీ నోటి నుంచే

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఐదు కన్సల్టెన్సీల కన్సార్షియంతో రూ.141 కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నామని, మధ్యలో రూ. 1.5 లక్షల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. నిజం చెప్పాలంటే ఈ సంఖ్య కూడా ఆయన చెప్పిందే. జూలై 20న గోపనపల్లిలో సీఎం మాట్లాడుతూ.. 'మూసీ పరీవాహక అభివృద్ధి కోసం ఐదేండ్లలో లక్షా యాభై వేల కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసి తొందర్లోనే పనులు ప్రారంభించబోతున్నాం' అని ప్రకటించారు. సీఎం, మంత్రులు ఈ ప్రాజెక్టు విలువను తొలుత రూ. 50 వేల కోట్లతో మొదలు పెట్టి రూ.లక్షన్నర కోట్లకు పెంచారు. ఈ ఏడాది ఏప్రిల్ 21న నల్లగొండలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. అక్కడ మాట్లాడుతూ 'రూ.50 వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేసి నల్లగొండ జిల్లాను కాలుష్యం నుంచి విముక్తి కల్పించే బాధ్యత నాది' అని ప్రకటించారు. జూలై 14న మంత్రి జూపల్లి కృష్ణారావు ఓ సదస్సులో మాట్లాడుతూ 'మూసీని రూ.70వేల కోట్లతో లండన్‌లోని థేమ్స్ తరహాలో అభివృద్ధి చేయబోతున్నాం' అని చెప్పారు. ఆరు రోజుల తర్వాత ప్రాజెక్టు విలువను స్వయంగా సీఎం రూ.లక్షన్నర కోట్లకు పెంచారు.

## సుందరీకరణ కాదు.. పునరుజ్జీవనం!

- మూసీ మురికి నుంచి పరీవాహక ప్రజలను కాపాడుతాం
- లక్షన్నర కోట్లు కాదు.. 141 కోట్లే
- సచివాలయంలో రేవంత్ ప్రెస్ మీట్

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): మూసీనదిపై తాము చేపట్టబోయేది సుందరీకరణ ప్రాజెక్టు కాదని, పునరుజ్జీవ ప్రాజెక్టు అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీ మురికి నుంచి ప్రజలను కాపాడాలనేదే తమ తాపత్రయమని పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో సీఎం మీడియా సమావేశం నిర్వహించారు. ఆరు నెలలుగా 33 బృందాలు మూసీ పరీవాహక ప్రాంతంలో పర్యటించి సర్వే చేసినట్టు వివరించారు. 1,690 ఇండ్లు నదీ గర్భంలో ఉన్నాయని, బఫర్ జోన్‌లో 10 వేల ఇండ్లు ఉన్నట్టు తెలిపారు. ప్రజలను ఒప్పించి, వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు, ఖర్చుల కోసం రూ.25 వేలు ఇచ్చి తరలిస్తున్నట్టు పేర్కొన్నారు. బఫర్ జోన్‌లో ఉన్న ఇండ్లకు నష్టాన్ని అంచనా వేసి పరిహారం ఇస్తామని చెప్పారు. మూసీ పునర్జీవం కోసం అంతర్జాతీయస్థాయిలో పేరొందిన ఐదు కంపెనీలతో కన్సార్షియం ఏర్పాటు చేసి ఒప్పందం చేసుకున్నట్టు వివరించారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను 18 నెలల్లో అందిస్తారని, ఆ తర్వాత ఐదేండ్లపాటు ప్రాజెక్టు అమలులో భాగస్వాములు అవుతారని చెప్పారు. ఆరున్నరేండ్ల సేవల కోసం వారితో రూ.141 కోట్లతో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. ప్రతిపక్షాలు చెప్తున్న రూ. లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు, మూసీ నది పునరుజ్జీవనంపై చర్చకు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు పెట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని, అవసరమైతే న్యాయ నిపుణుల సలహా తీసుకుని ఎంపీలను కూడా ఆహ్వానిస్తామని చెప్పారు. రాజకీయ పార్టీల అధ్యక్షులకు అనుమానాలు ఉంటే తనకు రాతపూర్వకంగా పంపాలని పేర్కొన్నారు.

### జర్నలిస్టులూ తప్పు పడుతున్నరు!

'అన్నా మీరేమైనా తప్పు చేస్తున్నారా? వాళ్లు చెప్తున్న విషయాల్లో నిజమనిపిస్తున్నది? అని కొందరు పాత్రికేయ మిత్రులు నమ్ముతున్నారని, మూసీ సుందరీకరణపై తమ ప్రభుత్వం తప్పు చేస్తున్నదేమోనన్న అనుమానం వారిలో కలిగేలా విషప్రచారం జరుగుతున్నదని రేవంత్‌రెడ్డి చెప్పారు.

## సౌత్ కొరియాకు 'మూసీ' బృందం

**21 నుంచి 24 వరకు పర్యటన • సియోల్‌లోని రివర్ ఫ్రంట్ అభివృద్ధి పరిశీలన**

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ): స్థానిక ఎమ్మెల్యేలు, జీహెచ్‌ఎంసీ, ఇతర శాఖల అధికారులతో కలిసి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సారథ్యంలో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో పర్యటించనుంది. ఈ నెల 21 నుంచి 24 వరకు వీరి పర్యటన కొనసాగుతుంది. సియోల్‌లోని రివర్ ఫ్రంట్ అభివృద్ధిని ఈ బృందం పరిశీలిస్తుంది. ఇందుకోసం 50 మందితో కూడిన బృందం 20న హైదరాబాద్‌లో బయలుదేరుతుంది. ఈ పర్యటనకు వెళ్లకూడదని మూసీ పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు.




